క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిట్వేలి : మండల పరిధిలోని చిట్వేలి, భాకరాపురం, కస్తూరివారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చిట్వేలి ట్రాన్స్‌కో ఏఈ వెంకటాచలపతి ఒక ప్రకటనలో తెలియజేశారు. తిమ్మయ్యగారిపల్లి సబ్ స్టేషన్‌లో బ్రేకర్స్ మారుస్తున్నందున ఈ అంతరాయం కలుగనున్నట్టు ఏఈ తెలిపారు. సరఫరాలో అంతరాయాన్ని గుర్తించి వినియోగదారులు సహకరించాల్సినదిగా ఆయన కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : పేదలకు కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన పది మంది లబ్ధిదారులకు రూ. 13.20 లక్షలు విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. గాలివీడు మండలానికి చెందిన ముగ్గురు, రామాపురం మండలం నుంచి ఇద్దరు, సంబేపల్లి మండలం నుంచి ఒకరు, లక్కిరెడ్డిపల్లి మండలం నుంచి ఒకరు, రాయచోటి మండలం నుంచి ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.

పరామర్శ

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె సర్పంచ్ మునీర్ కుమారుడు అఫ్రిజ్ బాషా వెన్నుముక నొప్పితో బాధపడుతూ వైద్యం పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం రాత్రి అఫ్రిజ్ బాషాను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో లాభాలు



మాట్లాడుతున్న డీఆర్సీ ఏడీఏ శ్రీకాంత్

గాలివీడు : పంట మార్పిడితో అధిక లాభాలు పొందవచ్చునని డీఆర్సీ ఏడీఏ శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గోపనపల్లె గ్రామం రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్‌తో కలిసి అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమంలో భాగంగా వేరుశనగ, ఉలవలు పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్టు పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిద్దాం..



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ కొండారెడ్డి

రామాపురం : ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని మండల ఎస్ఐ కొండారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బండపల్లె టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు పరిమితి వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. ప్రమాదాలలో ఎక్కువ మంది హెల్మెట్ ధరించకపోవడంతో ప్రాణాలు కోల్పోయారన్నారు. అలాంటి పరిస్థితి తలెత్తకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు.

పేదలకు దుస్తుల పంపిణీ



నూతన వస్త్రాలు అందజేస్తున్న గుణ యాదవ్

నందలూరు (రాజంపేట) : అన్నమయ్య యువశక్తి సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పునగాని గుణయాదవ్ పుట్టినరోజు, ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా రాజంపేట పరిసర ప్రాంతాలలో ఉన్న పేదలకు, చిన్నారులకు నూతన వస్త్రాలను మంగళవారం అందజేశారు. అనంతరం నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామంలో ఉన్న కాంతమ్మ తల్లి ఆశ్రమం, మాతృదేవోభవ వృద్ధాశ్రమం, అభయక్షేత్రం వంటి ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించినట్టు ఆయన తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ములకలచెరువు: అక్రమంగా ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీటీయం మండలం కాట్నగల్లుకు చెందిన పి. ఆంజినేయులు(44), టి. శ్రీనివాసులు(37)లు మద్యం తరలిస్తుండగా జింకలమిట్ట క్రాస్ వద్ద అరెస్టు చేశామన్నారు. వారినుంచి 96 టెట్రా ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

దేదీప్యమానం.. శరన్నవరాత్రి ఉత్సవం

దేవీ శరన్నవరాత్రులు మంగళవారంతో మూడు రోజు పూర్తి చేసుకుంది. ఉత్సవాలను ఆలయ కమిటీలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఆలయాల్లో అమ్మవారికి విశేష పూజలు జరిపి, అలంకరించారు. అలానే అమ్మవారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయాల్లో నిర్వహించిన హోమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దేవీ అనుగ్రహం కోసం మహిళలు, భక్తులు ఉపవాసాలుంటూ నిష్ఠ పూజలు జరిపారు. సాయంత్రం అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: అన్నపూర్ణదేవిగా దర్శనమిస్తున్న వీరచౌడేశ్వరి దేవి



రామాపురం: అన్నపూర్ణాదేవీ అలంకరణలో ..



చిట్వేలి: అన్నపూర్ణదేవీ అలంకారంలో వాసవీమాత



సంబేపల్లె: అన్నపూర్ణదేవి అలంకరణలో నల్లగంగమ్మ



ఓబులవారిపల్లె: బిందె సేవలో పాల్గొన్న ఆర్యవైశ్యులు



రాజంపేట టౌన్: అన్నపూర్ణదేవిగా మారెమ్మ



రాజంపేట: నందలూరులో గజలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న కన్యకా పరమేశ్వరి



రాయచోటి టౌన్: శ్రీ రాజరాజేశ్వరి దేవిగా కన్యకా పరమేశ్వరి



రైల్వేకోడూరు అర్బన్ అన్నపూర్ణాదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి



సిద్దవటం: బాలాత్రిపుర సుందరిగా గంగా భవాని



ఒంటిమిట్ట: అన్నపూర్ణాదేవి దేవిగా వాసవీ మాత



పుల్లంపేట: ప్రత్యేక అలంకారంలో మారెమ్మ



రాయచోటి టౌన్: శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా చౌడేశ్వరి



రాజంపేట టౌన్: అన్నపూర్ణదేవిగా వాసవీమాత



లక్కిరెడ్డిపల్లె : అన్నపూర్ణాదేవిగా సర్వమంగళ దేవి



రాయచోటి టౌన్: భద్రకాళి ఆలయంలో..

బాల్య వివాహాలపై అవగాహన కల్పిద్దాం

ఓబులవారిపల్లె : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ విజయారావు పేర్కొన్నారు. మంగళవారం బాలిరెడ్డిపల్లి పంచాయతీలో బాల్య వివాహాల రహిత భారతదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లోపంతో బాల్య వివాహాలు నిర్వహిస్తున్నారని, ఇటువంటి వాటిని విడనాడాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ విషయంపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన అవసరమన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

బీమా సాయం అందజేత

మండలంలోని బాలిరెడ్డిపల్లి ఎస్టీకాలనీ గ్రామానికి చెందిన తుపాకుల శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద దహన సంస్కారాలకు రూ. 10 వేలు ఎంపీడీఓ విజయారావు నామినీ తుపాకల రుణయ్యకు అందజేశారు. సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి పాల్గొన్నారు.

నేటి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ వివరాలు

రామాపురం : నేడు మండల పరిధి నీలకంఠ్రావుపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ నాయకుడు జాకీర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రంలో అన్ని రకాల వ్యాధులకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి చికిత్సలు, పరీక్షలు ఉచితంగా చేసి మందులను ఉచితంగా అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు లేబాకలో

నందలూరు (రాజంపేట) : నందలూరు మండలంలోని లేబాక గ్రామ పంచాయతీలో బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాల్గొంటారన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొనాలన్నారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక సభలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం పింఛాలో ఈనెల 18, 19 తేదీలలో రక్షణ సువార్త ఆశీర్వాద పండుగల పేరుతో ఆధ్యాత్మిక సభలను నిర్వహిస్తున్నట్లు బెరకా సంఘ పాస్టర్ పి.నిరంజన్, సుమతిలు తెలిపారు. బీఆర్ఐఎం పరిచర్య వర్తమానికులు కేఆర్ జాన్, కడప రెడీమర్ పరిచర్య వర్తమానికులు డాక్టర్ బి.సుధీర్‌లు పాల్గొని దైవ సందేశం అందజేస్తారన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయన్నారు. మధురమైన పాటలు, సంగీతం వినిపిస్తారని, అనంతరం ప్రార్థనలు ఉంటాయని వివరించారు.

సన్మానం

రాయచోటి టౌన్ : రాయచోటి ప్రాంతంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించే వినయ్‌కుమార్‌ను కూచిపూడి ఆర్టిస్టు, శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు ఘనంగా సన్మానించారు. ప్రపంచ కూచిపూడి దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామంలో సోమవారం పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వెంగపాటి చిన్నసత్యం జయంతి వేడుకలలో భాగంగా కృష్ణా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఆంజనేయ ప్రసాద్ చేతులమీదుగా సన్మానం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులలో ఉండే కళలను గుర్తించి ప్రోత్సహించినందుకు సన్మానం నిర్వహించినట్లు వినయ్‌కుమార్ తెలిపారు.

కూచిపూడిలో బాలికల ప్రతిభ అభినందనీయం

రాయచోటి : కూచిపూడిలో రాయచోటికి చెందిన బాలికలు అత్యుత్తమ ప్రతిభను కనబరచడం అభినందనీయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో శ్రీ కాళహస్తిలో జరిగిన జాతీయ స్థాయి నృత్యోత్సవంలో కూచిపూడిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శివనంది, నాట్య మయూరి అవార్డులు పొందిన హేమశ్రీ, సరని, సంధ్యా, ఉమ దుర్గావతిలను ఎమ్మెల్యే అభినందించారు. రానున్న రోజులలో మరిన్ని ప్రదర్శనలు నిర్వహించి రాయచోటి పేరును దశదిశలా వ్యాపింపచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కూచిపూడి గురువులు మణి తదితరులు పాల్గొన్నారు.



బాలికలను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

గండిమడుగు ఆలయ అభివృద్ధికి కృషి

గాలివీడు : మండలంలో ప్రసిద్ధి చెందిన గండిమడుగు శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల కృషి ఎల్లవేళలా ఉంటుందని మండల వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఖాదర్‌మోద్దీన్(ఎస్‌కే), వైస్ ఎంపీపీ-2 గాలి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం సోలార్(సీజీఆర్) నిధులు రూ. 24 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్డు పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. మాట్లాడుతూ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో గండిమడుగు, వెలిగల్లు ప్రాజెక్టులను పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సర్పంచ్ బాబా ఫక్రుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆస్తులకంటే ఆరోగ్యం ఎంతో ప్రధానం

- జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం
- వైద్య శిబిరాలకు భారీగా ప్రజానీకం
- చికిత్స అందించి, మందులు పంపిణీ చేసిన వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు

రాజంపేట టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష పేద, మధ్య తరగతి ప్రజలకు వరంలాంటిదని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ రెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకేపాటి ప్రారంభించారు. అనంతరం రోగులనుద్దేశించి ఆకేపాటి మాట్లాడారు. మనిషికి డబ్బు, ఆస్తులకంటే ఆరోగ్యం ఎంతో ప్రధానమైదన్నారు. ఆరోగ్యం సరిగా లేకుంటే అష్ట ఐశ్వర్యాలు ఉన్నా ప్రయోజనం లేదన్నారు. దీన్ని గుర్తించిన సీఎం వైఎస్ జగన్ జగనన్న ఆరోగ్య సురక్షను ఏర్పాటు చేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, చొప్పా ఎల్లారెడ్డి, వడ్డే రమణ, దండు గోపి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం : పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వరం అని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు సయ్యద్ జవహర్ బాషా తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. చికిత్స అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి వైద్య ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. అనంతరం కంటి వైద్యులు అద్దాలు అవసరమైన రోగులకు అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పలువురు వైద్యులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల కోసం శ్రమించే వ్యక్తి సీఎం వైఎస్ జగన్

పెనగలూరు : ప్రజల కోసం నిరంతరం శ్రమించే నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. మంగళవారం నల్లపరెడ్డిపల్లిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్పంచ్ హరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డిలు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలోనే మొదటిసారిగా ప్రజలచెంతకు వైద్య సేవలు అందించే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగనన్నే ప్రారంభించారన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. కొండూరు అజయ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కొంతమంది దొంగల ముఠాలు ఏకమై సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై కుట్రలు చేస్తున్నారన్నారు. మంచి చేస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అండగా నిలవాలన్నారు.



పెనగలూరు: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కొరముట్ల, అజయ్ రెడ్డిలు

రైల్వేకోడూరు : రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సంచలన ఫలితాల దిశగా దూసుకుపోతుందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిగుంటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ఇంటింటి సర్వే ద్వారా అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి, వైద్య శిబిరాలను నిర్వహించి చికిత్స అందించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రవేశపెట్టినదే జగనన్న ఆరోగ్య సురక్ష అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సుధాకర్‌రాజు, జెడ్పీటీసీ రత్నమ్మ, సర్పంచ్ రమణ, ఎంపీటీసీ షఫి, తహసీల్దారు రామ్మోహన్, ఎంపీడీఓ జాషువా, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట టౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష కిట్టు అందజేస్తున్న ఆకేపాటి, పోలా

వీరబల్లి(రాజంపేట) : జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం అందుతోందని వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. మంగళవారం పెద్దవీడు పంచాయతీ పరిధిలో సర్పంచ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 400 మందికి వైద్యం అందించారు. ఎంపీడీఓ మల్లీశ్వరి, స్పెషలాఫీసర్ జాకీర్ హుస్సేన్, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరనాగిరెడ్డి, ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు : ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యాన్ని అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం మండలంలోని గొట్టివీడు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యం సౌకర్యాన్ని కల్పిస్తోందన్నారు.



గాలివీడు: వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



చిన్నమండెం: కంటి అద్దాలను అందజేస్తున్న దృశ్యం

ఆలయానికి రూ. 4.50 లక్షల గ్రానైట్ వితరణ

చిట్వేలి : రాపూరు ప్రధాన రహదారిలో రాజుకుంట క్రాస్ రోడ్డువద్ద వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయానికి వెంకటరాజుపల్లికి చెందిన కేశారపు ఈశ్వరయ్య రూ. 4.50 లక్షల విలువైన గ్రానైట్ బండలను వితరణ చేసి పనులు చేయిస్తున్నారు. 20 సంవత్సరాల క్రితం పందిరి కింద చిత్రపటంతో ప్రారంభమైన ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభమైందన్నారు. దాతల సహకారంతో ప్రస్తుతం ఆలయ విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి కొండేటి వెంకటయ్య, దాత ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



పనులను పర్యవేక్షిస్తున్న దృశ్యం

నివాళి

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని కొర్లకుంట దళితవాడ గ్రామంలో గుండెపోటుతో మరణించిన మొగిలి కృష్ణయ్య (75) మృతదేహాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు మంగళవారం సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతే మన లక్ష్యం

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజుపురం హరిజనవాడ అంగన్‌వాడీ పరిధిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మమ్మ ఆధ్వర్యంలో చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. పిల్లల భోజనం ముందు, తరువాత చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలో వారికి అవగాహన కల్పించారు. ఐదు రకాలుగా డెమో చేసి పిల్లలకు, తల్లులకు చూపించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడం వలన వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని వారికి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది